క్లుప్తంగా

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి షష్టి



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎస్ఎల్‌వీ మార్కెట్ వద్దనున్న సుబ్రహ్మణేశ్వర నాగుల కట్ట ఆలయంలో శనివారం సుబ్రహ్మణ్య షష్టి పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు విజయ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు నాగుల దేవతలకు పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, బస్మాభిషేకం, రుద్రాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పూలు, వెండి కవచ అలంకరణలతో స్వాములను అలంకరించి పూజలు చేపట్టారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు.

చీడపీడల వివరాలు యాప్‌లో నమోదు చేయాలి



వ్యవసాయ పరిశోధనా స్థానంలో పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కదిరి అర్బన్: రైతుల పంటలకు సోకిన తెగుళ్లు, చీడపీడల వివరాలు రైతు సేవా కేంద్రం సిబ్బంది నేషనల్ పెస్ట్ సర్వెలెన్స్ సిస్టమ్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు ఆదేశించారు. శనివారం స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానంలో రైతు సేవా కేంద్రం సిబ్బందికి మేలైన యాజమాన్య పద్ధతులపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పంటకు సోకిన తెగుళ్లు వాటి నివారణా చర్యలను రైతులకు తెలియజేయాలన్నారు. అనంతరం వ్యవసాయ పరిశోధనా స్థానంలో సాగు చేస్తున్న పంటలను పరిశీలించడంతోపాటు పంటల సాగులో ఉన్న సందేహాలను వ్యవసాయ శాస్త్రవేత్తలతో నివృత్తి చేయించారు. ఏడీఏలు సనావుల్లా, సత్యనారాయణ, ఏఓ శ్రీనివాసరెడ్డి, ఎంపీఈఓలు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదరించాలి



దివ్యాంగురాలికి వీల్‌చైర్ అందజేస్తున్న మేరీవటమట్టమ్

చెన్నేకొత్తపల్లి: దివ్యాంగులకు పేమానురాగాలను పంచాలని టింబక్ట్ కలెక్టివ్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేరీవటమట్టమ్ సూచించారు. శనివారం ప్రతిభా వికలాంగుల సొసైటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మేరీవటమట్టమ్ మాట్లాడుతూ.. దివ్యాంగుల కోసం సంస్థ అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దివ్యాంగులకు అవసరమైన పరికరాలను ఉచితంగా పంపిణీ చేశారు.

భూ సమస్య పరిష్కారమయ్యేదాకా దీక్ష



దీక్షకు మద్దతు తెలిపిన సీఐటీయూ నేతలు

గాండ్లపెంట: ప్రభుత్వం సర్వే నంబరు 1482లో తమకు మంజూరు చేసిన 2.41 ఎకరాల భూ సమస్య పరిష్కారమయ్యే వరకు దీక్ష కొనసాగిస్తామని కటారుపల్లికి చెందిన హరిజన ఓబులేసు, వెంకటరమణ తెలిపారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం రెండో రోజు దీక్ష కొనసాగించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి సాంబశివ మాట్లాడుతూ దళితులను భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. తహసీల్దార్ సైతం దళితులు భూమిని సాగు చేసుకోవచ్చని తెలిపి వారిని భూమిలోకి వెళ్లకూడదని మాట మార్చడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దళిత కుటుంబం చేపట్టిన దీక్షకు తమ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ అక్కులప్ప, పారిశుధ్య కార్మికులు నరసింహులు, దొడ్డప్ప పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కదిరి టౌన్: భార్యతో గొడవపడిన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. నిజాంవలీ కాలనీకి చెందిన శివప్రసాద్ మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్య కుమారి అతడితో గొడవపడి పట్నంలో ఉంటోంది. ఈక్రమంలో శనివారం సాయంత్రం శివప్రసాద్ భార్యతో ఫోన్‌లో గొడవపడ్డాడు. తీవ్రమనస్థాపానికి గురైన అతడు పూటుగా మద్యం సేవించి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే అతడిని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.

రైల్వేస్టేషన్‌లో సమస్యల హాల్ట్!

- నిరుపయోగంగా మరుగుదొడ్లు, తాగునీటి కుళాయిలు
- బ్రాడ్‌గేజ్‌గా మార్చినా ప్రయాణికుల తప్పని ఇక్కట్లు
- ఎక్స్‌ప్రెస్ రైళ్లు స్టేషన్‌లో ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు



తనకల్లు రైల్వేస్టేషన్



నిరుపయోగంగా తాగునీటి కుళాయి



మరుగుదొడ్లకు తాళం వేసిన దృశ్యం

తనకల్లు: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అతి పెద్ద మండలాల్లో తనకల్లు ఒకటి. తనకల్లు రైల్వేస్టేషన్‌ను బ్రాడ్‌గేజ్‌గా మార్చి గతంలో కొత్త భవనాలను నిర్మించారు. అయితే అన్నీ ఉన్నా...సేవలు సున్నాలా మారింది రైల్వేస్టేషన్ పరిస్థితి. ప్రయాణీకుల సౌకర్యార్థం నిర్మించిన మరుగుదొడ్లకు ఇంతవరకు నీటి సరఫరా ఇవ్వకపోవడంతో తలుపులకు తాళాలు వేశారు. తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన నీటి కుళాయిల దిమ్మెలు పగిలిపోయాయి. దీంతో చుక్క నీరు రావడం లేదు. అలాగే నీటి కుళాయిలకు ఇచ్చిన పైప్‌లైన్ ఎక్కడికక్కడ పాడైపోవడంతో నీటి సరఫరా ఆగిపోయింది. దీంతో ప్రయాణీకులు నీటిని బాటిళ్లలో నింపుకోడానికి సౌకర్యం లేకపోవడంతో బయట దుకాణాల్లో నీటి బాటిళ్లను కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. రైల్వేస్టేషన్‌ను కొత్తగా నిర్మించినా తమకు కష్టాలు తప్పడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

ఆగని ఎక్స్‌ప్రెస్ రైళ్లు

బ్రాడ్‌గేజ్ అయిన తర్వాత గుంతకల్లు నుంచి తిరుపతికి తనకల్లు రైల్వేస్టేషన్ మీదుగా ప్యాసింజర్ రైళ్లతో పాటు దాదాపు ఏడు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. రైల్వేస్టేషన్‌లో ప్యాసింజర్ రైళ్లు మాత్రమే ఆగుతుండగా ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగడం లేదు. నరసాపూర్ నుంచి ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు రోజూ నడుస్తోంది. దీనితో పాటు పద్మావతి ఎక్స్‌ప్రెస్ (వారంలో రెండు రోజులు) , అంకోలా ఎక్స్‌ప్రెస్ (వారంలో ఒక రోజు) , మధురై ఎక్స్‌ప్రెస్ (వారంలో ఒక రోజు), అమరావతి ఎక్స్‌ప్రెస్ (వారంలో రెండు రోజులు), నాగర్ కోయిల్ (వారంలో నాలుగు రోజులు) , సెవెన్ హిల్స్ (వారంలో రెండు రోజులు) ఎక్స్‌ప్రెస్ రైలు తనకల్లు రైల్వేస్టేషన్ మీదుగా నడుస్తున్నాయి. అయితే వీటిలో ఒక్క ఎక్స్‌ప్రెస్ రైలు కూడా ఇక్కడ ఆపడం లేదు.

విద్యార్థులకు తప్పని కష్టాలు

మండలం నుంచి ఎంతో మంది విద్యార్థులు విజయవాడ, గుడివాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, చెన్నై, హైదరాబాదు వంటి నగరాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుంటున్నారు. అయితే ఇక్కడ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపకపోవడంతో 25 కిలో మీటర్ల దూరంలోని కదిరికి లేదా 20 కిలో మీటర్ల దూరంలో ఉన్న అన్నమయ్య జిల్లా మొలకలచెరువుకు వెళ్లి అక్కడి నుం,ఇ రైలు ఎక్కే పరిస్థితి నెలకొంది. అలాగే అక్కడి కళాశాలల నుంచి పండుగ సెలవులు, ఇతర సెలవు దినాలలో స్వగ్రామాలకు రావాలంటే మళ్లీ కదిరికి లేదా మొలకలచెరువుకు వచ్చి అక్కడి నుంచి ఇతర వాహనాల్లో ఇంటికి రావాల్సి ఉంటుందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. పెద్ద మండలమైన తనకల్లు నుంచి పుణ్యక్షేత్రాలైన తిరుపతి, అరుణాచలం, మధురై, నెల్లూరు తదితర దూర ప్రాంతాలకు నిత్యం పెద్ద సంఖ్యలో వెళ్లి వస్తుంటారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపకపోవడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తనకల్లు రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆగేలా చర్యలు తీసుకోవాలని గత కొన్నేళ్లుగా కోరుతున్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు గుంతకల్లు రైల్వే డీఆర్ఎంలకు వినతి పత్రాలను సైతం అందజేసినట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తనకల్లు రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



రైల్వేస్టేషన్‌లో నెలకొన్న సమస్యలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు, తాగునీటి కుళాయిలను మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలి. రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలి.

– ఆనంద్, తనకల్లు

ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలి



నా ఇద్దరు పిల్లలు గుడివాడలో చదువుకుంటున్నారు. పిల్లల దగ్గరకు వెళ్లి రావాలంటే కదిరికి లేదా మొలకలచెరువుకు వెళ్లి నరసాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో వెళ్లాల్సి ఉంటుంది. ఇది చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. తనకల్లు రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపితే మాలాంటి ఎంతోమంది తల్లిదండ్రులకు ఉపయోగకరం.

– రహంతుల్లా, కొక్కంటిక్రాస్

అందరికీ విన్నవించాం



తనకల్లు రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని పదేళ్లుగా ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు రైల్వే ఉన్నతాధికారులకు సైతం వినతిపత్రాలను అందజేశాం . అయినా ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. రైల్వేస్టేషన్‌లోనే రిజర్వేషన్ కౌంటర్‌ని ఏర్పాటు చేయాలి. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపేలా చొరవ చూపాలి.

– అనిల్, తనకల్లు

సాయుధ దళాల సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న రంగనాయకులు

పుట్టపర్తి: దేశ రక్షణలో ఎనలేని సేవలందిస్తున్న సాయుధ దళాల సేవలు మరువలేనివని హిందూపురం డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్, ఆంగ్ల అధ్యాపకుడు రంగనాయకులు పేర్కొన్నారు. శనివారం బుక్కపట్నం సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఓబిలేసు అధ్యక్షతన ఫ్లాగ్ డే ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రంగనాయకులు మాట్లాడుతూ దేశ రక్షణ కోసం సాయుధ దళాలు అహర్నిశలూ శ్రమిస్తున్నాయన్నారు. ఇందులో భాగంగా అనేక మంది ప్రాణ త్యాగాలు చేశారన్నారు. వారి సేవలను గుర్తించి భారత ప్రభుత్వం ఏటా డిసెంబర్ 7వ తేదీని ఫ్లాగ్ డేగా జరుపుకోవటం సంతోషదాయకమన్నారు. దేశ రక్షణలోనే గాకా అంతర్గతంగా జరిగే అనేక విపత్తుల సమయంలో సాయుధ దళాల సేవలందించిన విషయం ప్రతి ఒక్కరూ గుర్తు పట్టుకోవాలన్నారు. కళాశాల సిబ్బంది, విద్యార్థులు దేశ సేవలో అమరులైన సైనికులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు గంగరాజు, ఓబయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి



కదిరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, చిత్రంలో జేసీ అభిషేక్‌కుమార్

సాక్షి నెట్‌వర్క్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని వక్తలు పేర్కొన్నారు. ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లోని కేజీబీవీ, ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో శనివారం ఆయా పాఠశాలల హెచ్‌ఎంల అధ్యక్షతన మెగా పేరెంట్స్–టీచర్స్ సమావేశం నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు రంగోలి, టగ్ ఆఫ్ వార్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. కదిరి గర్ల్స్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ఆర్డీఓ వెంకటసన్యాసి శర్మ, డీఎస్పీ శివనారాయణస్వామి హాజరయ్యారు. రామగిరి మండలం కుంటిమద్ది జెడ్పీ హైస్కూల్‌లో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత హాజరై పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళం ప్రకటించారు. ధర్మవరం బీఎస్ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ఎస్పీ రత్న హాజరై 'డ్రగ్స్ వద్దు బ్రో' పేరుతో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. పుట్టపర్తి మండలం పెడపల్లి హైస్కూల్‌ల జరిగిన కార్యక్రమానికి పల్లె సింధూరరెడ్డి హాజరయ్యారు.

ఉద్యోగుల రక్షణకు ప్రత్యేక చట్టం రూపొందించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఎన్పీకుంట: ఉద్యోగుల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కమ్మగుట్టపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల ఆత్మీయసమావేశంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు ఎస్టీయూ నాయకులు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తరగతి గదిలోనే కొందరు విద్యార్థులు గురువులపై దాడి చేసి చంపిన అమానవీయ సంఘటనలు జరుగుతుండటం దిగజారుతున్న విలువలకు నిదర్శనమన్నారు. ఉపాధ్యాయుడి మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించేలా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. మృతి చెందిన ఉపాధ్యాయుని కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ఉద్యోగుల రక్షణ కోసం చట్టసభల్లో చర్చ జరిపి ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు.

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోండి



తాడిమర్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న తపాలాశాఖ సిబ్బంది

తాడిమర్రి: తపాలా శాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని పోస్టు మాస్టర్ చాంద్‌బాషా కోరారు. మండల కేంద్రంలో శనివారం తపాలాశాఖ ఉద్యోగులు తపాలా సేవలపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పోస్టు మాస్టర్ మాట్లాడుతూ తపాలాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సుకన్య సమృద్ధి యోజన, ఆర్డీఎస్పీ, ఎస్‌బీపీఆర్‌ఎం, ఇన్సూరెన్స్, పీఎస్‌ఐ సేవలను తెలియజేశారు. తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తపాలా ఉద్యోగులు వేణు, రామ్మోహన్‌రెడ్డి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌సీపీ నాయకుల నిరసన



అమడగూరు బ్యాంకు ఎదుట నిరసన తెలుపుతున్న ఆర్‌సీపీ నాయకులు

అమడగూరు: ఆంధ్ర ప్రగతి గ్రామీణబ్యాంకు ప్రధాన కార్యాలయం కడపలోనే ఉంచాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ (ఆర్‌సీపీ) నాయకులు శనివారం స్థానిక ఏపీజీబీ ఎదుట నిరసనకు దిగారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం విలీనం పేరుతో కడపలో ఉన్న ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని విజయవాడకు తరలించాలని చూస్తోందన్నారు. కార్యాలయం కడపలో ఉండటం ద్వారా చాలా మందికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రధాన కార్యాలయాన్ని తరలిస్తే భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివిజన్ నాయకుడు మున్నా, రైతుసంఘం నాయకులు రామచంద్ర, రెడ్డెప్ప, సోము, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారి వర ప్రసాద్

ధర్మవరం రూరల్: వాహనదారులు నిబంధనలను అతిక్రమించి అధిక లోడునే వేసుకోవద్దని రవాణాశాఖ అధికారి వర ప్రసాద్ హెచ్చరించారు. శనివారం పట్టణం సమీపంలో గొట్లూరు రోడ్డులో సిబ్బందితో కలిసి వాహన తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుభకార్యాలకు వెళ్లే సమయంలో లారీ, వ్యాన్లలో పరిమితికి మించి ప్రజలను ఎక్కించుకోరాదన్నారు. వాహన రికార్డులు, లైసెన్సులను తనిఖీ అధికారులకు చూపించి సహకరించాలని డ్రైవర్లకు సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ సందర్భంగా రికార్డులు సరిగా లేని పలు వాహనాలకు జరిమానా విధించారు.

పారిశ్రామిక రంగంలో మహిళలు సత్తా చాటాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

పుట్టపర్తి అర్బన్: పారిశ్రామిక రంగంలో ప్రతి మహిళా సత్తా చాటాలని హైదరాబాద్‌కు చెందిన థండర్ సాఫ్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ సుధారాణి పిశల్లె పేర్కొన్నారు. శనివారం పుట్టపర్తి సమీపంలోని సంస్కృతీ విద్యాసంస్థల్లో ఉమెన్ ఇన్ ఇండస్ట్రీ 4.0 ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. బెంగళూరు ఆపరేషనల్ ఎక్సలెన్స్ యూనివర్సిటీ రిలేషన్స్ హెడ్ రీతు, పాలో ఆల్టో అకాడమీ అధికారి రేస్మీ, అసెంచర్ ప్రాజెక్ట్ మేనేజర్ సింధు శ్రీనాథయ్య, ఎఫ్‌పీఅండ్‌ఏ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీ అలేఖ్య హాజరై ప్రసంగించారు. వివిధ రంగాల్లో మహిళలు సాధించిన విజయాలను తెలుసుకోవడం ద్వారా భవిష్యత్తుపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయన్నారు. అనంతరం కళాశాల డీన్ బాలకోటేశ్వరి మాట్లాడుతూ సంస్కృతి కళాశాలల్లో విద్యతో పాటు వివిధ రకాల పరిశ్రమలు, పారిశ్రామిక వేత్తల జీవిత గాథలు, వారు సాధించిన విజయాలను తరచూ విద్యార్థులకు వివరిస్తామన్నారు. అనంతరం వక్తలకు మెమొంటోలు అందజేసి ఘనంగా సత్కరించారు.

విజేతలు వీరే..

ఈసందర్భంగా వివిధ యూనివర్సిటీ విద్యార్థులకు పలుపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఎమర్జింగ్ బిజినెస్ లీడర్ అవార్డును సంస్కృతీ కళాశాల విద్యార్థిని గాయత్రి ప్రియ దక్కించుకుంది. ఇన్నోవేషన్ జీనియస్ అవార్డును అన్నమాచార్య యూనివర్సిటీ విద్యార్థిని జడప్రోలు చేతన, సోషల్ ఇంపాక్ట్ అవార్డును హేమా శృతి(రాఘవేంద్ర ఇన్‌స్టిట్యూట్), స్పోర్ట్స్ స్టార్ అవార్డు రామాంజనేయులు(తిరుపతి అన్నమాచార్య యూనివర్సిటీ), ట్రైల్ బ్లాజర్ అవార్డు లహన్వి త(తిరుపతి వెంకటేశ్వర యూనివర్సిటీ) కైవసం చేసుకున్నారు.

ప్రశాంతంగా జీవించాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ సోమశేఖర్

బత్తలపల్లి: గ్రామాల్లో ప్రజలు గొడవల జోలికెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని ఎస్‌ఐ సోమశేఖర్ సూచించాచారు. శనివారం రాత్రి పత్యాపురం గ్రామంలో తమ సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశమయ్యారు. పేకాట, మట్కా, మద్యానికి దూరంగా ఉండాలని, మద్యం విక్రయించేవారి సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. అనంతరం రౌడీషీటర్లు, గత కేసుల్లో ఉన్న నిందితులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

గుండెపోటుతో ఎల్‌ఐసీ ఏజెంట్ మృతి



లోకభూషణ(ఫైల్)

పుట్టపర్తి టౌన్: పట్టణానికి చెందిన ఎల్‌ఐసీ ఏజెంట్ లోకభూషణ(56) గుండెపోటుతో మృతి చెందారు. ఆయన స్వగ్రామం పుట్టపర్తి మండలం బీడుపల్లి. విశ్వహిందూ పరిషత్ సభ్యుడిగా ఉంటూ హిందూ ధర్మపరిరక్షణ కోసం కృషి చేసేవాడు. ఇందులో భాగంగా శనివారం బైక్‌పై బయటకు వెళ్లిన ఆయన చెర్లోపల్లి వద్ద గుండపోటు రావడంతో వాహనాన్ని పక్కకు ఆపి కుప్పకూలిపోయాడు. లోకభూషణ మృతిపై పలువురు ప్రముఖులు విచారం వ్యక్తం చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.

విగ్రహ పోత అయ్యప్ప స్వామి దర్శనం



పంచలోహ అయ్యప్ప స్వామి విగ్రహం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేశవనగర్‌లో నున్న అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం పంచలోహ విగ్రహ పోత కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం ప్రత్యేక పూజల నడుమ విగ్రహ పోత పోసిన అయ్యప్పస్వామి విగ్రహాన్ని బయటకు తీశారు. స్వామి విగ్రహానికి గురుస్వామి పీజీ విజయ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయ్యప్పస్వామి విగ్రహాన్ని ధాన్యంలో ఉంచి పూజలు నిర్వహించారు.

విద్యా సామగ్రి, దుస్తులు పంపిణీ



ఆర్.రామాపురం పాఠశాల విద్యార్థులతో లండన్‌కు చెందిన సాయి భక్తులు

నల్లమాడ: లండన్‌కు చెందిన సత్యసాయి బాబా భక్తులు పుష్ప పర్మమ, రక్షా చోహాన్ తమ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం మండలంలోని రెడ్డిపల్లి, ఆర్.రామాపురం పాఠశాలల్లో వంద మంది విద్యార్థులకు పలకలు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్ల తదితర విద్యా సామగ్రి పంపిణీ చేశారు. అలాగే ఆయా గ్రామాల్లో వంద మంది పేద మహిళలకు చీరలు, దుప్పట్లు అందజేశారు. దాతలు మాట్లాడుతూ భగవాన్ సత్యసాయి బాబా 99వ జయంతిని పురస్కరించుకొని పుట్టపర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పేదలకు తమవంతు సాయం అందిస్తున్నట్లు తెలిపారు. బాబా స్ఫూర్తితో మున్ముందు కూడా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. దాతలతో పాటు భక్తులు .కే. లక్ష్మీనారాయణ, కే. హరికృష్ణ, సాయి, భరణి పాల్గొన్నారు.

హాకీ పోటీల్లో విద్యార్థి సత్తా



సాయిదినేష్

పుట్టపర్తి అర్బన్: ఇటీవల జరిగిన హాకీ పోటీల్లో జగరాజుపల్లిలోని మంగళకర కళాశాల విద్యార్థి బీకాం సెకండియర్ విద్యార్థి సాయిదినేష్ ప్రతిభచాటి ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యాడు. ఈమేరకు శనివారం కళాశాలలో కళాశాల మేనేజింగ్ ట్రస్టీ సురేష్ కుమార్ విద్యార్థిని అభినందించారు. విద్యార్థి ఈనెల 12 నుంచి 16 వరకూ తమిళనాడు లో జరిగే హాకీ పోటీల్లో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తరపున ప్రాతినిధ్యం వహిస్తాడన్నారు. పోటీల్లో ప్రతిభచాటాలని కళాశాల ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆర్యాప్రకాష్, ఏఓ జయచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, పీడీ శ్రీనివాసులు అధ్యాపకులు ఆకాంక్షించారు.